

# ఖలీఫాగారికి ఒకటవ పాఠం

ఇస్లామీయ సామ్రాజ్యానికి ప్రతినిధిని 'ఖలీఫా' అంటారు. ఇస్లాంను ఆరాధించే ప్రజల బాగోగులన్నీ ఆ ఖలీఫానే చూడాలి. మహమ్మద్ ప్రవక్త తర్వాత ఈ పదవిని మొదటగా చేపట్టింది హజ్రత్ ఉమర్‌గారు. ఈయన గొప్ప పరిపాలనాదక్షుడు. ఈయనంటే ముస్లిం ప్రజానీకంలో అపార భక్తిశ్రద్ధలు వున్నాయి. ఈయన గురించి అనేక కథనాలు మా యిళ్లల్లో ప్రచారంలో వున్నాయి.

ఖలీఫాగారు ఒకసారి సిరియాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. రాత్రయ్యింది. దారిలో బిడారు ఆగింది. దూరంగా ఎడారిలో కొన్ని గుడిసెలు కనిపించాయి. ఎలాగూ ఇక్కడ ఆగాంకదా వీళ్ల కష్టసుఖాలు తెలుసుకుందాం అని ఖలీఫాగారొక్కరే అక్కడకు వెళ్లారు. అక్కడొక గుడిసెలో ఒక ముసలామె చెంపకు చేయి ఆనించి విచారంగా కూర్చుని వుంది.

ఖలీఫాగారు ఆమెకు సలాము చేసి, 'అవ్వా. నీకు ఉమర్ ఖలీఫాగారు తెలుసా?' అని అడిగారు.

'ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం నాకేమిటి?' అందామె కోపంగా.

ఉమర్ ఖలీఫాగారు ఆశ్చర్యపోయారు.

ఒక్కక్షణం తటపటాయించి 'అదేమిటి? ఆయన మీ ఖలీఫా గదా. ఆయన్ను అందరూ మెచ్చుకుంటారే? నువ్వేమిటి పుల్లవిరుపుగా మాట్లాడుతున్నావ్?' అని అడిగారు.

ముసలామెకి యింకా కోపం వచ్చింది.

'ఏమయ్యా. నువ్వేమైనా ఆ ఖలీఫాగారి తోకవా? నెత్తిన పెట్టుకొని మాట్లాడుతున్నావు. ఆయన అంత గొప్పవాడైతే కావచ్చుగానీ నాకు మాత్రం కాదు. పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచి యిక్కడే వున్నాను. ఎంతో పేదరికం అనుభవించాను. ఎన్నో కష్టాలుపడ్డాను. ఏనాడైనా నా గురించి ఆయన పట్టించుకున్నాడా? యిదిగోమ్మా యీ డబ్బును అవసరానికి వాడుకో అని పంపించాడా? యిప్పుడు కాదులే ఆయన సంగతి. పైకి వెళ్లాక దేవుడి ముందు చెబుతాను' అంది ముసలామె.

ఖలీఫాగారు కంగారు పడ్డారు.

'ఏమమ్మా. నువ్వు యీ పరిస్థితుల్లో వున్నావని ఆయనకు ఏనాడైనా చెప్పుకున్నావా?' అన్నారు.

'చెప్పుకోవాల్సిన ఖర్మ నాకేంటయ్యా?' అని దబాయించిందామె.



'అదేమిటి. ఆయన ఎక్కడో రాజధానిలో వుంటాడు గదా. నీ బాధ ఆయనకు ఎలా తెలుస్తుంది?'

'ఎక్కడో ఉండేవాడు ఈ మారుమూల పల్లె వరకు ఆయనగారి సామ్రాజ్యాన్ని ఎందుకు విస్తరించాలి? ప్రజల కష్టసుఖాలు ఎంతదూరం వరకు పట్టించుకోగలడో అంతవరకే రాజ్య పరిమితిని పెట్టుకోవచ్చు గదా. పెద్ద పుణ్యాత్ముడిలాగా నా పల్లె వరకు విస్తరించినప్పుడు చచ్చినట్టు నా కష్టం తెలుసుకొని తీరాలి. ఆయన సామ్రాజ్యంలో ప్రజలకు వేరే ఏ పనిలేదా? వాళ్లొచ్చి మొరపెట్టుకునేదాకా యీయన వినడా?' అందా ముసలావిడ.

ఖలీఫా గారు మరేం మాట్లాడలేదు. ఇదాయనకు జీవితంలో ఎన్నటికీ మరచిపోలేని పాఠం. 'ఎంతవరకు చూసుకోగలడో అంతవరకే రాజ్య పరిధిని ఉంచుకోవాలి' అనే మాటను ఆయన చివరివరకూ గుర్తుపెట్టుకొని, ప్రజలు తన వద్దకు వచ్చే అవసరం లేకుండా తనే ప్రజల వద్దకు వెళుతూ పరిపాలన చేశాడు.